క్లుప్తంగా

భజన కళాకారుడికి సత్కారం



ఏలేశ్వరంలో లక్ష్మణరావును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, తదితరులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం భజన కళాకారుడిని ఘనంగా సన్మానించారు. విశ్వహిందూ పరిషత్ మండలశాఖ అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చేతులమీదుగా భజన కళాకారుడు భజంతుల లక్ష్మణరావును పూలమాల, శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు లక్ష్మణరావు చేస్తున్న సేవలను కొనియాడారు. భజనల ద్వారా ప్రజలను మరింత చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో అలమండ వీరరాఘవస్వామి, సూర్యనారాయణమ్మ, తనూజ, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

చాంపియన్ ఆఫ్ చాంపియన్స్ టైటిల్ విజేత రోహిత్



రోహిత్‌ను అభినందిస్తున్న ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్

గండేపల్లి: జేఎన్‌టీయూకే ఇంటర్–కాలేజియెట్ బెస్ట్ ఫిజిక్ కాంపిటీషన్‌లో సూరంపాలెం ఆదిత్య కళాశాల విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ టైటిల్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్.రోహిత్ ఈ నెల 9న ఆదిత్య కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే బెస్ట్ ఫిజిక్ కాంపిటీషన్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కేరళలో జరిగే ఆలిండియా ఇంటర్–యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ కాంపిటీషన్ పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌ను ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, కోచ్ డి.సాయి కిషోర్, తదితరులు అభినందించారు.

వైభవంగా గోదాదేవికి సారె సమర్పణ



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ధనుర్మాస వ్రతం నిర్వహించారు. గోదాగోష్టి సభ్యులు, భక్తుల సహాయ సహకారాలతో తయారు చేయించిన సువర్ణ కంఠాభరణాన్ని గోదామాతకు అలంకరించారు. అనంతరం పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలతో గోదామాతకు సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించి 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ (సెబ్) సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి 30 లీటర్ల సారాతో పాటు సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో ఎదురి అప్పన్నదొర అలియాస్ వీరబాబుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో గుబ్బల ఆదినారాయణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

రాజానగరం: మండలంలోని నందరాడకు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) కొల్లాటి ప్రసాద్ (40) మృతి చెందాడు. రాజానగరంలో నివాసం ఉంటున్న ఆయన కార్యాలయంలో విధులు ముగించుకుని బైకుపై రాజానగరం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నా అతనిని కాపాడలేకపోయింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- రాజుపేటలో జిరాయితీ భూములు, ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని రాజుపేటలో బుధవారం సర్పంచ్ బుద్దా సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి రాజా పాల్గొన్నారు. లబ్ధిదారులకు డి.పట్టాల భూములను జిరాయితీగా మార్పు చేసిన పట్టాలు, 55 మందికి ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన బాగుందా ? లేదా ? అని స్థానికులను ప్రశ్నించారు. చాలా బాగుందని, మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని స్థానికులు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. దేశంలో మరెక్కడ లేని విధంగా రాష్ట్రంలో పేదలకు సొంతి ఇళ్లు సమకూరుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఒకేసారి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారన్నారు. ప్రజల మండల కేంద్రాల చుట్టూ తిరగకుండా సొతూరులోనే సచివాలయాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేసి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు సుబ్రహ్మణ్వేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, నాయకులు వడ్డాది యేసుబాబు, కిల్లాడ గోవిందు, తహసీల్దార్ ఎల్.శివకుమార్, ఎంపీడీఓ పి.రవికుమార్, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. పిల్లలతో రోజూ వ్యాయామం చేయించాలని, పౌష్టికాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- మంత్రి దాడిశెట్టి రాజా
- బిళ్లనందూరులో సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



బిళ్లనందూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండంలోని బిళ్లనందూరులో రూ.60 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయం, ఆర్బీకే భవనాలను బుధవారం ఆయన సర్పంచ్ బొత్స మంగతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే పరిస్థితి పోయిందన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారన్నారు. గ్రామ సచివాలయం, ఆర్బీకే వ్యవస్థల ఏర్పాటుతో దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పాటు అనేక దేశాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల విత్తనాలు, పురుగుమందులతో పాటు సాగులో మంచి ఫలితాలు సాధించేందుకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా అడుగులేస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి రాజా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యానాయుడు, మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, ఏపీబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, మండల చైర్మన్ సుర్ల రాజు, కో ఆప్షన్ సభ్యుడు కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్
- లింగంపర్తిలో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేత, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు) సూచించారు. మండలంలోని లింగంపర్తిలో బుధవారం పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అధ్యక్షతన పార్టీశ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాలకు మేలు జరిగిందన్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలో వరుపుల సుబ్బారావు విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కో ఆర్డినేటర్ వరుపుల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బెహరా రాజేశ్వరి, గొల్లు చినదివాణం పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, వాసిరెడ్డి భాస్కరబాబు, వరుపుల సూరిబాబు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



అన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన సర్పంచ్ కుమారరాజా, నాయకులు

అన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా అన్నారు. ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం అన్నవరంలో జన భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పెదరావి చెట్టు, ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాలకు సర్పంచ్ కుమార్ రాజా ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ఆశిన శ్రీనివాస్, సింగంపల్లి రాము, పార్టీ నాయకులు యాళ్ల భాస్కరరావు, గంపల రాజేష్, కార్యదర్శి జేవీఎస్ రామకృష్ణ, గ్రేడ్–5 కార్యదర్శి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా బుధవారం ప్రత్తిపాడులో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు రిలే దీక్షలు చేపట్టారు. బార్ అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేసి, కోర్టు విధులకు హాజరు కాకూడదని తీర్మానించారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు బొంగుశారి మధుబాబు, ఆర్‌వీ వెంకటరావు, రాజేశ్వరరావు, రాయి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లోని అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. లాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని కోరుతూ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐలాజ్ అడ్‌హాక్ కమిటీ సభ్యురాలు అవసరాల దేవి, బార్ ఉపాధ్యక్షురాలు ఆడారి సుగుణ, కలవలపల్లి సుజన తదతరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



ఏలేశ్వరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పాపారావు

ఏలేశ్వరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలోని 18వ వార్డులో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిదన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యుడు పాపారావు రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, కోరాడ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని ఎంపీపీ పర్వత రాజబాబు తెలిపారు. శంఖవరంలో బుధవారం ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల అభీష్టం మేరకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరుపుల సుబ్బారావుకు మద్దతుగా నిలువనున్నట్లు ఆయన ప్రకటించారు. భవిషత్‌తో వరుపుల సుబ్బారావుకు మద్దతుగా పని చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో పడాల దొంగబాబు, పర్వత సత్యనారాయణ మూర్తి, పర్వత చంటిబాబు, పగడాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

హుండీల ద్వారా రూ.28 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.28,16,208 ఆదాయం లభించిందని కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. బుధవారం దేవదాయ ధర్మదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబు నాయుడు, కాకినాడ గ్రేడ్–2 కార్యనిర్వహణ అధికారి వి.సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తల పర్యవేక్షణలో హుండీలను తెరచి నగదు లెక్కించామన్నారు. 60 రోజులకు నాణేలు రూ.89,643, నోట్లు 27,26,565 మొత్తం రూ.28,16,208 సమకూరిందన్నారు. బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ డీపీఎం వీబీ రాయ్

తొండంగి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్పతిదీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (చేయూత) వీబీ రాయ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీ శక్తి భవన్‌లో బుధవారం వైఎస్సార్ క్రాంతి పథం సీఆర్పీలకు లక్పతిదీదీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల జీవన స్థితిగతులను అంచనా వేసి ఈ పథకానికి అర్హులను గుర్తించాలన్నారు. ప్రతి గ్రామంలో కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుని నాన్‌ఫామ్ సెక్టార్, ఫామ్ సెక్టార్లుగా విభజించి జీవనోపాధి కల్పించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు పేదల ఆదాయ, వ్యయాలను మదింపు చేసి మూడేళ్లలో వారిని లక్షాధికారులను చేయడమే లక్పతి దీదీ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం వై.సత్తిబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అడ్డాల సూర్యకాంతం, సీఆర్పీలు, సీసీలు పాల్గొన్నారు.

22న మాంసం దుకాణాలు తెరవొద్దని వినతి



గోకవరంలో మాంసం దుకాణదారులకు వినతి పత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

గోకవరం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 22న ప్రతిఒక్కరూ మాంసాహారానికి దూరంగా ఉండాలని సనాతన ధర్మ ప్రబోధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం గోకవరంలోని మాంసం దుకాణాదారులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబా మాట్లాడుతూ అయోధ్యలో ఈ నెల 22న జరిగే శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ రోజున మాంసాహారన్ని త్యజిద్దామన్నారు. ఆ రోజు మాంసం దుకాణాలు తెరవద్దని ఇప్పటికే దుకాణకారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో దోసపాటి సుబ్బారావు, కందుల శ్రీరామారావు, గంగ్రెడ్డి సన్యాసిరావు, పిల్లంగోరు పాపారావు, ఆదం మణికంఠ, తాటికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలి



గోకవరం ప్రధాన రహదారిపై బైఠాయించిన లారీ డ్రైవర్లు

గోకవరం: కేంద్ర ప్రభుత్వ 106 చట్టాన్ని (హిట్ అండ్ రన్ జీవో) వెంటనే ఉపసంరించుకోవాలని ఐఓసీఎల్, హెచ్‌సీఎల్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీలకు చెందిన లారీ డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం గోకవరంలో లారీలను నిలిపి వేసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుకోని సంఘటన వల్ల జరిగిన ప్రమాదాలకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా లారీ డ్రైవర్లపై వేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. అలాగే 55 సంవత్సరాలు దాటిన ప్రతి లారీ డ్రైవర్‌కు పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు.

క్రీడాప్రతిభను వెలికితీయడమే లక్ష్యం



ఏలేశ్వరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు



తొండంగిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ గంగబాబు



కోటనందూరులో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆడుదాం..ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆల్ ద బెస్ట్ చెప్పారు. చక్కటి ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఏలేశ్వరం: యువత క్రీడల్లో రాణించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల్లో రాణించి ప్రభుత్వం లక్ష్యాన్ని చేరుకొనేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

తొండంగి: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. తొండంగి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తుందన్నారు. రావికంపాడు జెడ్పీ హైస్కూల్లో కూడా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎన్‌సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చోడిశెట్టి అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ రౌతు శివ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ఉపాధి హామీ అనుసంధానం

కొత్తపల్లి: వ్యవసాయ పనులకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని కేంద్రాన్ని కోరినట్టు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత తెలిపారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురం మండల పరిధిలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి రూ.14 కోట్లు ఖర్చు చేయగా వాటిలో రూ.10 కోట్లు కూలీలకు వేతనాలుగా చెల్లించారన్నారు. మిగిలిన రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో హార్టీ కల్చర్ ద్వారా పూలతోటల పెంపకానికి నిధులు వెచ్చిస్తారన్నారు. గతంలో ఉపాధి పనులకు రెండు పూటలా మస్తరు వేసేవారని, ప్రస్తుతం ఒకసారే వేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు గాను కొత్త చెరువుల తవ్వకాలకు గ్రామస్తుల అనుమతులు తీసుకుంటున్నట్టు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్టు చెప్పారు.